క్లుప్తంగా

హైస్కూల్‌లో సైకిల్ స్టాండ్ ఏర్పాటు



పూర్వ విద్యార్థులు సమకూర్చిన సైకిల్‌స్టాండ్

మునగపాక: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమవంతు సాయం అందజేస్తున్నారు. ఇదే స్కూల్‌కు చెందిన 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గతంలో కళావేదికను అందుబాటులోకి తీసుకువచ్చారు. తాజాగా మరో అడుగు ముందుకేసి విద్యార్థులకు అవసరమయ్యే సైకిల్ స్టాండ్‌ను సమకూర్చారు. వేసవిలో సైకిళ్లు ఎండలో ఉండిపోవడంతో తరచూ పంక్చర్లు అవుతుండడాన్ని గమనించి స్టాండ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుత విద్యార్థులు పూర్వ విద్యార్థులు ఔదార్యం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో శివరాత్రి జాగరణ



సుంకపూరు శివాలయంలో శివరాత్రి జాగరణ చేస్తున్న భక్తులు

కోటవురట్ల: మహా శివరాత్రి పర్వదినాన ఆలయాలలో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు, అభిషేకాలు చేసి బుధవారం రాత్రంతా జాగరణ చేశారు. కోటవురట్ల ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం, సుంకపురు శివాలయం, పాములవాకలోని నవదుర్గల పట్టాలమ్మతల్లి ఆలయాలలో జాగరణలు చేశారు.

రాజయ్యపేట తీరానికి పోటెత్తిన భక్తులు



రాజయ్యపేటలో సముద్ర స్నానమాచరిస్తున్న భక్తులు

నక్కపల్లి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రాజయ్యపేట సముద్ర తీరానికి వేలాది మంది భక్తులు పోటెత్తారు. శివరాత్రి తెల్లవారులు జాగరణ చేసిన భక్తులంతా పుణ్యస్నానమాచరించేందుకు రాజయ్యపేట తరలివచ్చారు. రాజయ్యపేటతో నూకతాత పండుగ కావడంతో వేలాది మంది భక్తులు ఇక్కడ తిరునాళ్లలో పాల్గొని సముద్ర స్నానమాచరించారు. వేలాది మంది తరలి రావడంతో రాజయ్యపేట వెళ్లే మార్గాలన్ని రద్దీగా మారాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ కుమార స్వామి, ఎస్‌ఐ సన్నిబాబులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

1న గౌరీశంకరుల మహోత్సవం



మహోత్సవ గోడపత్రికను విడుదల చేస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: మండలంలో సత్యవరం గ్రామంలో వచ్చే నెల ఒకటో తేదీన నిర్వహించే గౌరీశంకరుల మహోత్సవ గోడపత్రికను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి చిక్కాల రామారావు హాజరు కావాలని మహోత్సవ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తమ్మిర్సి గంగారావు, బోయిడి బుల్లాబాయి, తదితరులు పాల్గొన్నారు.

ముసిలితల్లికి బంగారు నగ బహూకరణ



బంగారు నగ అందజేస్తున్న శ్రీను, బాలజయంతి దంపతులు

మునగపాక: మండలంలోని అరబుపాలెం లోని ముసిలితల్లి అమ్మవారికి అనకాపల్లికి చెందిన నూకాంబిక జ్యూస్ పాయింట్ యజమాని బొడ్డేడ శ్రీను, బాలజయంతి దంపతులు గురువారం పావుతులం బంగారు నగ బహూకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

ప్రశాంతంగా పోలింగ్



కోటవురట్లలో పోలింగ్‌ను పర్యవేక్షిస్తున్న తహసీల్దారు తిరుమలబాబు



పాయకరావుపేట: పోలింగ్ బూత్‌లో ఓటు వేయడానికి వచ్చిన ఉపాధ్యాయులు



మునగపాక పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న డీఎస్పీ విష్ణు స్వరూప్



ఎస్.రాయవరం: బూత్‌లో ఓటు వేసి వస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగు బూత్ –98లో ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. తహసీల్దారు తిరుమలబాబు పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ రమేష్ భద్రతా ఏర్పాట్లు చూశారు. 81 మంది ఓటర్లకు గాను 78 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డిప్యూటీ డీఈవో పి.అప్పారావు ఇక్కడ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగు కేంద్రానికి సమీపంలో పీఆర్టీయూ, ఏపీటీఎఫ్ సభ్యులు తమ అభ్యర్థుల గెలుపు కోసం విడివిడిగా టెంట్లు వేశారు. ఎన్నడూ లేని విధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నాయకులు పోలింగు కేంద్రానికి సమీపంలో మరో టెంట్ వేసి హడావుడి చేశారు.

మునగపాకలో 41 మంది ఓటు హక్కు వినియోగం

మునగపాక: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం–106లో మొత్తం 44 మందికి గాను 41 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ పి.ప్రసాదరావు గట్టి బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ సరళిని పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ పరిశీలించారు. ఉదయం నుంచి పోలింగ్ మందకొడిగా సాగింది. సాయంత్రం వరకు ఇదే రీతిలో జరిగింది. ఉపాధ్యాయులు ఒక్కొక్కరుగా పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మునగపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

పాయకరావుపేటలో 162 మంది...

పాయకరావుపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పట్టణంలో ప్రశాంతంగా జరిగింది. సచివాలయం –5లో బూత్ నంబర్–102లో 170 మంది ఓటర్లకు గాను 162 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు పోలింగ్ అధికారి సత్యనారాయణ తెలిపారు. ఓటరు జాబితాలో 149వ నంబరుకు ఓటరు ఎం.గణేష్ ముందుగా ఓటు వేశారు. అసలైన ఓటరు తర్వాత రావడంతో టెండరు ఓటింగ్ ఇచ్చి ఓటు వేయించినట్లు పీవో తెలిపారు.

ఎస్.రాయవరం: ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా పి.ధర్మవరం ప్రాథమిక పాఠశాల బూత్‌లో 81 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని హోంమంత్రి వంగలపూడి అనిత పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా అనకాపల్లి అగ్రికల్చర్ కళాశాల అధికారి జయంతి వ్యవహరించారు. పోలింగ్ సరళిని పరిశీలించారు. తహసీల్దార్ జె.రమేష్‌బాబు సందర్శించారు.పోలింగ్ బూత్‌కు కొంతదూరంలో ఉపాధ్యాయ సంఘాలు ఓటు వేయాలని అభ్యర్థించాయి. ఏపీటీఎఫ్, కూటమి నాయకులు ప్రచారం చేశారు.

నక్కపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్‌లో 52 మంది ఉపాధ్యాయులకు గాను 51 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు వేసిన వారిలో మహిళలు 18 మంది, పురుషులు 31 మంది ఉన్నారు. పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ నర్సింహమూర్తి, ఆర్‌ఐ కన్నబాబు పరిశీలించారు. సీఐ కుమార స్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అచ్యుతాపురం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 73 మంది ఓటర్లకు గానూ 71 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం మీద 97.26 శాతం ఓటింగ్ నమోదైంది. కూటమి పార్టీ నేతలు ఈ ఎన్నికల్లోనూ రాజకీయంగా సందడి చేశారు. ఉపాధ్యాయ ఓటింగ్ స్లిప్‌ల శిబిరాల వద్ద కూటమికి చెందిన కీలక నేతలు బైఠాయించడం గమనార్హం.

యలమంచిలి రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మొత్తం 179 మందికిగాను 167 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 103 మంది పురుషులు, 62 మంది మహిళలు ఉన్నారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి పక్కన కూటమి మద్దతు తెలిపిన రఘువర్మ, పీడీఎఫ్ అభ్యర్థి విజయ గౌరి మద్దతుదారులు వేర్వేరుగా శిబిరాలు ఏర్పాటు చేసుకుని ఓటర్ల మద్దతు కోరేందుకు ప్రయత్నించారు. పోలింగ్ కేంద్రం వద్ద యలమంచిలి సీఐ నేతృత్వంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో పి.ధర్మవరం ఫీడర్ లైన్లో చెట్టుకొమ్మలు తొలగించే క్రమంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. పి.ధర్మవరంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు, గోకులపాడు గ్రామానికి ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

మునగపాక: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి గ్రామాల్లో శుక్రవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా మునగపాక, ఒంపోలు, నాగులాపల్లి, ఉమ్మలాడ, తిమ్మరాజుపేట, వాడ్రాపల్లి, నాగవరం, పాటిపల్లి, గంగాదేవిపేట తదితర గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కళాకారులకు డీజే సౌండ్ బాక్స్ వితరణ



కోలాటం కళాకారులకు డీజే సౌండ్ బాక్స్ అందజేస్తున్న దృశ్యం

మునగపాక: మహా శివరాత్రి సందర్భంగా స్థానిక వినాయక ఆలయం వద్ద లక్ష్మీ గణపతి బృందం కోలాటం ఆకట్టుకుంది. బృంద కళాకారులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ డీజే సౌండ్ బాక్స్‌ను సమకూర్చారు. దీన్ని వైఎస్సార్‌సీపీ నేత ఆడారి కాశీబాబు బుధవారం రాత్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. కోలాటంతో భక్తి భావం పెరగడంతో పాటు అనారోగ్య రుగ్మతలను తొలగిస్తుందన్నారు. అన్నమయ్య స్వర తరంగిణి కన్వీనర్ వెలగా శ్రీనివాసరావు, కేవీఎస్ అప్పారావు, ఆర్గనైజర్లు ఆడారి జగ్గారావు, ఆడారి సూరిబాబు, కోలాటం గురువు ఆడారి వెంకటప్పారావు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల ఉధృతి

- అపరాల పంటలకు అదే పరిస్థితి
- నష్టపోతున్న రైతులు



సర్వసిద్ధిలో రబీ వరి పంట



తెగులు ఆశించిన పంటకు క్రిమి సంహారక మందు పిచికారి చేస్తున్న రైతు

ఎస్.రాయవరం: రబీ సాగులోనూ మండల రైతులకు కష్టాలు తప్పడం లేదు. గతేడాది వర్షాలు ఆలస్యంగా కురవడంతో సర్వసిద్ధి, సైతారుపేట గ్రామాల్లో ప్రస్తుతం రబీ వరినాట్లు సాహసోపేతంగా వేయాల్సిన దుస్థితి నెలకొంది. దార్లపూడి, భీమవరం, కొరుప్రోలు తదితర గ్రామాల్లో 40 ఎకరాలు విస్తీర్ణంలో సాగు చేశారు. అదే క్రమంలో 4,200 ఎకరాల్లో అపరాలు వేశారు. ఆలస్యంగా కురిసిన వర్షాలు వరినాట్లకు అనుకూలిస్తాయని సాగు చేయగా, వేసిన నాట్లుకు తెగుళ్ల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పంట ఎదుగుదలకు ఆటంకంగా ఉందని అన్నదాతలు వాపోతున్నారు. మండలంలో ఖరీఫ్ నాట్లు సాగు చివరిలో వర్షాలు కారణంగా పంట తడిచి ముద్దయిన సంగతి తెలిసిందే. రబీ వరిసాగుకు బదులుగా అపరాలు మినుము, పెసర, బొబ్బరి సాగు చేస్తుంటారు. ఈ ఏడాది చెరువునీరు ఆధారంగా సర్వసిద్ధి, సైతారుపేట గ్రామాల్లో కాస్త ఎక్కువగాను, బోరు నీటి ఆధారంగా దార్లపూడి, భీమవరం గ్రామాల్లో తక్కువ విస్తీర్ణంలో రబీ వరి సాగు చేశారు. మిగిలిన వరిపొలాల్లో అపరాలు సాగు చేశారు. వర్షాలు కారణంగా పొలాల్లో నాట్లు చేసే సమయానికి తేమ శాతం ఎక్కువగా ఉండటంతో నాటిన అపరాలు ఎక్కువగా చనిపోయాయి. మొలకెత్తి పొలాల్లో చీడపీడలు బెడద పెరిగి అపరాలకు అపార నష్టం వచ్చిందని అన్నదాతలు అంటున్నారు. దీనివల్ల రబీ సీజన్‌లో సాగు చేసే పంటల్లో తీవ్ర నష్టాలు వచ్చాయని చెబుతున్నారు. ఖరీఫ్‌లో చేసిన సాగుకు బీమా, పంట నష్టం వస్తాదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రబీ సాగుకు వివరాలు నమోదు ప్రక్రియ ఉండటం లేదని చెబుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వం ఖరీఫ్, రబీలోనూ రైతుకు సాయమందించలేదు. అన్ని పంటలు అప్పులు చేసి సాగు చేశామంటున్నారు. గత ప్రభుత్వంలో సీజనల్ వారిగా ఎంతో కొంత నగదు రైతు అకౌంట్లో జమయ్యేది, కాస్త పెట్టుబడి సాయంగా పనికొచ్చేదని కొత్త ప్రభుత్వం ఎప్పుడు ఇస్తాదో, ఎలా ఇస్తారో చెప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ క్రమంలో ఖరీఫ్, రబీ పంటల్లో తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించకుంటే నష్టాలు



మండలంలో ఖరీఫ్‌కు అనుకూలించిన విధంగా సాగునీరు రబీలో ఉండదు. అయినప్పటికి చెరువు నీరు ఆధారంగా సర్వసిద్ధి, సైతారుపేట గ్రామాల్లో రబీ వరి సాగు చేశారు. రబీలో యాజమాన్య పద్ధతులు పాటించకుంటే నష్టాలు తప్పవు. మెలకువలు ఇస్తాం. మిగిలిన గ్రామాల్లో అపరాలు సాగు చేశారు. చివరి వర్షాలు కారణంగా అపరాలు సాగు విస్తీర్ణం తగ్గింది.

–సౌజన్య, వ్యవసాయాధికారి, ఎస్.రాయవరం

ప్రభుత్వం ఆదుకోవాలి



రబీ సీజన్‌కు అపరాలు మినుము, పెసర చల్లాం. ఖరీఫ్ కోసిన వరి పంట తడిచి ముద్దయి, ధాన్యం ముక్కుపోయాయి. పెట్టుబడి కూడా రాలేదు. ముక్కుపోయిన ధాన్యాన్ని కారుచౌకగా విక్రయించాను. తర్వాత వేసిన అపరాలు సాగు కూడా బాగాలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

–నూతి గోవిందు, రైతు, గోకులపాడు

ఘనంగా బాల వినాయకుని ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న బాల వినాయకుడు

మునగపాక: మండలంలోని అరబుపాలెం గ్రామంలో బాల వినాయకుని ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి వినాయకున్ని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. గ్రామానికి చెందిన పెంటకోట రామ్మూర్తి కుమారులు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. విఘ్నేశ్వర బాల వీరుల సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ సభ్యులు శరగడం యోగినాగేశ్వరరావు, పాలిమేర సంగమేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు బొడ్డేడ కృష్ణవేణి, ఉప సర్పంచ్ దొడ్డి బుజ్జి, గ్రామస్తులు కొయిలాడ చిన ఎర్రయ్యనాయుడు, ఆడారి మహేష్, బొడ్డేడ గంగాధరరావు, బొడ్డేడ ఆదినారాయణ, సూరప్పారావు, రమేష్, మోహన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి



నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నివాళులర్పిస్తున్న కలాం సేవా సంఘం సభ్యులు

అనకాపల్లి టౌన్: స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ అంబేడ్కర్ విగ్రహం వద్ద చంద్రశేఖర్ ఆజాద్ 94 వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ బ్రిటీషర్ల చేతిలో చావడం కంటే ఆత్మహత్యే మేలని దేశం కోసం ప్రాణాలొదిన మహా వీరుడని, దేశానికి ఆజాద్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సేవా సమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు, నటభూషణ్ శోభన్‌బాబు సేవా సమితి చైర్మన్ ముగడ అప్పారావు, ఆమ్ ఆద్మీ పార్టీ పట్టణ కన్వీనర్ కొణతాల హరనాథ్, దిలీప్, ఆజాద్, నర్సింగరావు, సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా తీర్థ మహోత్సవాలు



కేజేపురంలో పరుగు పందెంలో దౌడు తీస్తున్న గుర్రం

కె.కోటపాడు: గుల్లేపల్లిలో సీతారాముల తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుండి సీతారాముల ఆలయంలో భక్తులు పూజలు చేశారు. జిల్లా స్థాయి గుర్రం పరుగు పందేలు నిర్వహించి విజేతలకు నగదు పురస్కారం అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండారు దేముళ్లు, ఎంపీటీసీ సభ్యుడు కశిరెడ్డి దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

కె.జె.పురంలో కర్రి రామునాయుడు తీర్థం..

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం నుంచి అప్పలరాజుపురం పోవు రహదారిలో గల కీర్తిశేషులు కర్రి రామునాయుడు విగ్రహం వద్ద గురువారం తీర్థం నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులు కర్రి రామకృష్ణ సారధ్యంలో విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. అన్నసమారాధన జరిగింది. ప్రముఖ ఎముకల వైద్యుడు డాక్టర్ రాపేట రాజుబాబు దంపతులు, నియోజవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కర్రి నాగమణి కుటుంబ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

షుగర్ ఫ్యాక్టరీని కుదేలు చేస్తున్న కూటమి ప్రభుత్వం

చోడవరం రూరల్: సహకార రంగంలో కొనసాగుతున్న చోడవరం షుగర్స్‌ను కూటమి ప్రభుత్వం కుదేలు చేస్తుందని రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) అనకాపల్లి జిల్లా కార్యదర్శి కోన మోహనరావు ఒక ప్రకటనలో విమర్శించారు. ఏనాడూ లేని విధంగా పెద్ద పండగ పోయాక క్రషింగ్ ప్రారంభించి రోజుల తరబడి అవాంతరాలతో నెట్టుకొచ్చారన్నారు. అయినా రోజుల తరబడి చెరకు బండ్లు, పశువులతో కళ్లు కాయలు కాచేలా పస్తులతో రైతాంగం ఎదురు చూసి విసిగిపోయి నేడు ఆగ్రహంతో రోడ్డెక్కారని ఆవేదన వ్యక్తం చేశారు. సీజన్ సజావుగా నడపడానికి విడుదల చేసిన నిధులు ఎక్కడికి చేరాయని, ఖర్చు చేసినట్లయితే క్రషింగ్‌లో ఎడతెరపిలేని ఈ ఆటంకాలు దేనికని నిలదీశారు. ఫ్యాక్టరీని రానురాను నష్టాల్లోకి నెట్టి ప్రైవేటు పరం చేయడానికా అని నిలదీశారు.

నేడు తల నీలాలకు వేలం పాట

బుచ్చెయ్యపేట: వడ్డాది వేంకటేశ్వరస్వామి తలనీలాలకు శుక్రవారం ఉదయం 11 గంటలకు దేవస్థానం వద్ద వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈవో శర్మ తెలిపారు. మార్చి 1వ తేదీ నుంచి 2026 ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఏడాది కాలానికి భక్తులు సమర్పించిన తలనీలాలు అమ్ముకునేందుకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ. 5 వేలు ధరావతు చెల్లించాలన్నారు.

పుణ్య స్నానాలకు పోటెత్తిన భక్త జనం



ముత్యాలమ్మపాలెం తీరానికి పోటెత్తిన అశేష భక్త జన సందోహం



తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్త జనం

- కిక్కిరిసిన ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీరప్రాంతాలు



మహాశివుడిని దర్శించుకుంటున్న పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ నేతలు



తీరంలో పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: మహాశివరాత్రి ఉపవాసం, జాగరణ దీక్షల అనంతరం సముద్ర స్నానాలకు వచ్చే భక్తులతో ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు పోటెత్తాయి. అనకాపల్లి, విశాఖ జిల్లాల నలుమూలల నుంచి అశేష జన సందోహం తరలివచ్చింది. గురువారం తెల్లవారు జాము నుంచి తీరాలకు చేరుకుని, పుణ్య స్నానాలు ఆచరించి సమీపంలోని మహాశివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొంది అచ్చిబాబు ఆధ్వర్యంలో భక్తులకు సదుపాయాలు కల్పించారు. బుధవారం రాత్రి తీరంలో భక్తుల సౌకర్యార్థం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పరవాడ అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్ ఆధ్వర్యంలో పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు పర్యవేక్షణలో తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తన అనుచర వర్గంతో ముత్యాలమ్మపాలెం తీరంలో మహాశివుడిని దర్శించుకుని, పూజలు చేశారు.

బెల్ట్ దుకాణంపై దాడి

18 మద్యం బాటిళ్ల స్వాధీనం, వ్యక్తి అరెస్ట్

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని గవర జగ్గయ్యపాలెంలో ఓ బెల్ట్ దుకాణంపై పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న కోళ్లపల్లి కాసుబాబును అదుపులోకి తీసుకుని, అతడి వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న 18 క్వార్టర్ బాటిళ్లను మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.